www.methukuseema news　　Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం　　తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :10 | శుక్రవారం | 29 నవంబర్ 2024

Published from : Hyderabad,Sanagareddy　　పేజీలు :04　వేల : 5.00





## పౌష్టికాహారం అందించడంలో ఆలక్ష్యం తగదు

- వసతిగృహాల్లో తరచూ ఘటనలు చోటుచేసుకోవడంపై సిఎం ఆగ్రహం
- ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవు
- ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో,వసతిగృహాల్లో విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలి
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించే విషయంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇయ్యరాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. బడి పిల్లలకు అందించే ఆహారానికి సంబంధించి ఘటనలు పునరావృతం కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలను తనిఖీ చేసి, నివేదికలను సమర్పించాల్సిందే అని ఆదేశించారు. గడిచిన పదేండ్లలో గాడితప్పిన విద్యా వ్యవస్థను తిరిగి దారిలో పెట్టే క్రమంలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. విద్యార్థినీ విద్యార్థుల విషయంలో సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు దురుద్దేశంతో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, లేనివి ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## ఫిబ్రవరిలో స్థానిక సమరం



- జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ - ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతకు బిల్లు - రిజర్వేషన్లలో మార్పులు చేర్పులపై కసరత్తు - వచ్చేనెల 10నాటికి బిసి డెడికేటెడ్ కమిషన్ నివేదిక

హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : మరో నెలన్నర రోజుల్లో స్థానిక సంస్థల సమ రంతో తెలంగాణ వేడెక్కే అవకాశం కనిపిస్తోం ది. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు సంబంధించి ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా ఇద్దరు పిల్లల నిబంధనల ఎత్తివేతతో పాటు రిజర్వేషన్లలో మార్పులపై వేగం పెంచినట్లు సమాచారం. ఇందులో భాగంగా డిసెంబర్ 10 నాటికి బిసి డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అంద నున్నట్లు తెలిసింది. మొత్తం మూడు ఫేజ్లలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ఇప్ప టికే రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే తాజా సమాచారం ప్రకారం జనవరి 14వ తేదీన నోటిఫికేషన్ విడుదలయ్యే అవ కాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఫిబ్రవరి రెండో వారంలో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై తుది నిర్ణయమని, సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్లు ఉంటాయని, ఎన్నికలను పారద ర్శకంగా నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమి షన్ ఇప్పటికే ప్రకటించింది. మిగతా 2 లో..

## దిలావర్‌పూర్‌కు వస్తే తేల్చుకుందాం కేటీఆర్‌కు సీతక్క సవాల్

- అనుమతులు ఇచ్చింది కేసీఆర్, కేటీఆరేనన్న సీతక్క
- ఆందోళన జరుగుతున్న చోటుకే వెళ్లి అనుమతులు ఎవరిచ్చారో అడుగుదామన్న మంత్రి
- హాస్టళ్లలో జరుగుతున్న వరుస ఘటనలపై కుట్ర దాగి ఉందన్న మంత్రి



హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్‌కు రావాలని, ఇథనాల్ పరిశ్రమకు అనుమతులు ఎవరిచ్చారో అక్కడే తేల్చుకుందామన్నారు. అన్ని అనుమతులు ఇచ్చింది కేసీఆర్, కేటీఆరేనని ఆరోపించారు. కేటీఆర్ ఎక్కడెక్కడో తిరగడం వృథా అని, ఆందోళన జరుగుతున్న ప్రాంతానికే వెళ్దామన్నారు. ఎవరు అనుమతులు ఇచ్చారో అక్కడే తేల్చుదామన్నారు. సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... ఇథనాల్ కంపెనీకి గత ప్రభుత్వం అనుమతులిచ్చే నాటికి కంపెనీ డైరెక్టర్‌గా తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు తలసాని సాయి ఉన్నట్లు తెలిపారు. ఇథనాల్ కంపెనీ మరో డైరెక్టర్‌గా పుట్టా సుధాకర్ తనయుడు ఉన్నట్లు చెప్పారు. పుట్టా సుధాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకులని గుర్తు చేశారు. గతంలో గ్రామసభను నిర్వహించకుండానే ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. దిలావర్‌పూర్‌కు వచ్చేందుకు కేటీఆర్ సిద్ధమా? కాదా? చెప్పాలన్నారు. హాస్టళ్లలో వరుసగా జరుగుతున్న సంఘటనల వెనుక కుట్ర ఉందని భావిస్తున్నట్లు చెప్పారు. కుట్రలపై విచారణ జరిపి కుట్రదారులను బయటపెడతామని హెచ్చరించారు. కుట్రలకు పాల్పడే అధికారులపై క్రిమినల్ చర్యలు పెడతామన్నారు. అవసరమైతే అధికారులను సర్వీసుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. అన్ని విషయాలను ఆధారాలతో బయటపెడతామన్నారు. హాస్టళ్లలోని ఘటనల వెనుక తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు.

## నాగార్జున వేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న నాంపల్లి కోర్టు

- కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పరువు నష్టం దావా
- డిసెంబర్ 12న విచారణకు హాజరు కావాలని మంత్రికి ఆదేశం






హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : ప్రముఖ నటుడు నాగార్జున పరువు నష్టం కేసులో తెలంగాణ మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. కొండా సురేఖపై కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేసింది. తనపై కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నాగార్జున కోర్టులో పరువు నష్టం కేసు వేశారు. దీనిని విచారించిన న్యాయస్థానం పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుంది. మంత్రికి సమన్లు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. ఆరోజు జరిగే విచారణకు మంత్రి హాజరు కావాలని ఆదేశించింది. నాగచైతన్య, సమంత విడాకులపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. ఆమె వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పరువు నష్టం దావా వేశారు. ఈ రెండు కేసుల్లోనూ పిటిషనర్ల వాదనలను కోర్టు రికార్డ్ చేసింది.

## తెలంగాణలో పదో తరగతి మార్కుల విధానంలో కీలక మార్పులు

- ఇంటర్నల్ మార్కుల విధానాన్ని రద్దు చేస్తూ నిర్ణయం
- ప్రస్తుతం ఇంటర్నల్‌కు 20 మార్కులు
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని నిర్ణయం



హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : పదో తరగతి మార్కుల విధానంలో మార్పులు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కీలక మార్పులు చేసింది. ప్రస్తుతం పదో తరగతికి 20 ఇంటర్నల్ మార్కులు, 80 మార్కులకు ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ఇక నుంచి 100 మార్కులకు ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యార్థులకు 24 పేజీల ఆన్సర్ బుక్ లెట్స్ ఇవ్వాలని నిర్ణయించింది.

## కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ వెల్లడి
- ఓవర్ హాలింగ్ వర్క్ షాప్‌ను మ్యానుఫ్యాక్టరింగ్ యూనిట్‌గా అప్ గ్రేడ్ చేస్తూ ఆదేశాలు
- ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల తయారీకి అనుగుణంగా యూనిట్

హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. విభజన హామీలలో ఇది కూడా ఉంది. ప్రస్తుతం కాజీపేటలో ఉన్న ఓవర్ హాలింగ్ వర్క్ షాప్‌ను మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్ గ్రేడ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అప్‌గ్రేడ్ చేయాలని గత ఏడాది జులై 5న దక్షిణ మధ్య రైల్వే జీఎంకి రైల్వే బోర్డు లేఖ రాసింది. అప్ గ్రేడ్ చేసిన యూనిట్‌లో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌లను తయారు చేసేందుకు అనుగుణంగా యూనిట్‌ని అభివృద్ధి చేయడానికి ఈ ఏడాది సెప్టెంబర్ 9న రైల్వే బోర్డు ఆదేశాలిచ్చింది.

## నేడు మరోసారి ఢిల్లీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నెల 29న ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశానికి ఏఐసీసీ పెద్దలు, పార్టీ అగ్రనేతలు, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు, ముఖ్యనేతలు హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరు కానున్నారు. ఇందుకోసం ఆయన ఢిల్లీకి వెళ్తున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి దామోదర రాజనర్సింహ కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు.

# ఫిబ్రవరిలో స్థానిక సమరం

**మొదటిపేజీ తరువాయి** పంచా యితీ రాజ్ శాఖ పలు కీలక నిర్ణయాలు తీసు కుంది. అలాగే శాసనసభ ఎన్నికల జాబితాల ఆధారంగా వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందించింది.ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతకు బిల్లు కనీసం ఐదుగురు ఎంపిటిసి సభ్యులతో ఒక మండల ప్రజాపరిషత్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఎంపిటిసిలతో ఎంపిపి లున్న మండలాల్లో ఎంపిటిసిల సంఖ్యను ఐదుకు పెంచాలని నిర్ణయించింది. వచ్చే అసెంబ్లీ సమావే శాల్లో ఎంపిపి సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. వచ్చే పంచాయితీ ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధ నను ప్రభుత్వం ఎత్తివేయనుంది. ఆ మేరకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం బిల్లు పెట్టనుంది. రాష్ట్రంలో కుల గణన పూర్తి చేసిన తర్వాతే పంచా యతీలకు ఎన్నికలు నిర్వహిస్తామని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చెప్పారు. దీనికి అనుగుణంగానే కుల గణన కోసం ముందుగా కొత్త బిసి కమిషన్ ను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతమున్న కమిషన్ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగిసింది. కొత్త కమిషన్ ఛైర్మన్, సభ్యులపై సిఎం రేవంత్ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చి నట్లు సమాచారం. త్వరలో కొత్త కమిష నన్ను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మీడియాతో చెప్పారు. పంచాయతీ ఎన్నికలపై ఊపందుకున్న చర్చ.. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడనే చర్చ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. కాగా బిసి కమిషన్ ఏర్పాటైన వెంటనే యుద్ధ ప్రాతిపదిక కుల గణన చేపడుతుంది. కుల గణనకు అవసరమైన విధివిధా నాలు, నమూనాలు, పద్ధతులు, సర్వే ప్రశ్నలపై ప్రభుత్వం ఇప్పటికే ఒక అవగా హనకు వచ్చినట్లు తెలిసింది. ఆయా రాష్ట్రాల్లో చేపట్టిన కుల గణనపై సమాచా రాన్ని కూడా తెప్పించుకున్నారు. బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో చేపట్టిన కుల గణనపై అధ్యయనం చేశారు. కుల గణనకు అవసరమైన నిధుల్ని సమకూ ర్చాలని ఆర్థిక శాఖకు సమాచారాన్ని చేర వేసినట్లు తెలిసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిధుల కేటాయింపునకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే తలము నకలైంది. గురువారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు. 15 రోజుల ముందుగా షెడ్యూల్.. ఎన్నికలకు 15 రోజుల ముందుగా షెడ్యూల్ వెలువడుతుంది. ఈ లెక్కన జన వరి నెల చివరి వరకు రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్ని కలు ముగిసే అవకాశాలు కనిపిస్తు న్నాయి. ఇక రాష్ట్రంలో పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చేసిన తర్వాతనే పంచా యతీ ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఒకటి రెండు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తే, కాంగ్రెస్ కు ప్రజలనుంచి సానుకూలత ఉంటుందని, ఆ దిశగా ముందుకెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం.

---

# కాలేజీ యజమానికి బెదిరింపుల కేసులో బీఆర్ఎస్ విద్యార్థి నేత అరెస్ట్

- రూ.5 లక్షలు ఇవ్వాలని సీఎంఆర్ కాలేజీ యజమానిని బెదిరించినట్లుగా ఆరోపణలు
- ప్రశాంత్ మరో పదిమంది బెదిరించినట్లుగా ఫిర్యాదు
- నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు



హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : సీఎంఆర్ కాలేజీ యజమానికి బెదిరింపుల కేసులో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నేత ప్రశాంత్‌ను హైదరాబాద్‌లోని నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. బెదిరింపులు వచ్చినట్లుగా సీఎంఆర్ కాలేజీ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. దీంతో ప్రశాంత్‌తో పాటు మరికొంతమందిని అరెస్ట్ చేశారు.ప్రశాంత్, మరో పదిమంది సీఎంఆర్ కాలేజీ యజమాని ఇంటికి వెళ్లి రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. దీనిపై సీఎంఆర్ కాలేజీ యజమాని ఫిర్యాదు చేయడంతో వారిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

---

# తనపై కేసులు నమోదు కాకుండా అదేశించాలని హైకోర్టులో వర్మ పిటిషన్



హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : దర్శకుడు రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై అడ్వకేట్ జనరల్ (ఏజీ) వచ్చి వాదనలు వినిపిస్తారని, కాబట్టి తమకు సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది ఏపీ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ అభ్యర్థనకు హైకోర్టు అంగీకరించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత, అసభ్యకర పోస్టుల వ్యవహారంలో ఇక ముందు ఎలాంటి కేసులు నమోదు కాకుండా ఆదేశించాలని కోరుతూ వర్మ పిటిషన్ దాఖలు చేశారు. తనపై రాజ్యాంగ విరుద్ధంగా కేసులు పెట్టారన్నారు. ఈ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది.ఒకే అంశంపై పలుచోట్ల కేసులు పెడుతున్నారని ఆర్జీవీ తరఫు న్యాయవాదులు హైకోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదు కాకుండా చూడాలని కోరారు. అయితే, ఏజీ వచ్చి వాదనలు వినిపిస్తారని, కాబట్టి సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. ఇందుకు హైకోర్టు కూడా అంగీకరించింది.ఇదిలా ఉండగా, రాంగోపాల్ వర్మ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో వర్మ ఓ వీడియోను విడుదల చేశారు. తాను కేసులకు భయపడటం లేదని వెల్లడించారు. తాను ట్వీట్స్ పెట్టిన వారికి కాకుండా సంబంధం లేని వారి మనోభావాలు దెబ్బతింటే ఈ కేసులు, సెక్షన్లు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. ప్రస్తుతం తాను ఓ సినిమా షూటింగ్‌లో ఉన్నానని... అందుకే విచారణకు హాజరుకాలేకపోతున్నానని తెలిపారు.

# పాఠశాలల్లో సౌకర్యాలు, ఆహారంపై తనిఖీలు చేస్తున్నాం

- రాబోవు 10 రోజుల్లో 33 జిల్లాల్లో పర్యటిస్తాం
- నాణ్యమైన భోజనం అందించేందుకు స్టాండర్డ్ ఆపర్టిన్ ప్రాసిజర్
- తెలంగాణ విద్యాకమీషన్ చైర్మన్ ఆకునూరి మురళీ








కరస్పాండెంట్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ రెసిడెన్సియల్స్ హాస్టల్స్, కేజీబీవీలు, పాఠశాలల్లో భోజన వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైవుతున్న సంఘటనలు చోటు చేసుకున్న నేపద్యంలో తెలంగాణ విద్యాకమీషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేపట్టింది. అందులో భాగంగా గురువారం సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్ మండలం మల్లెపల్లిలోని బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అందులో విద్యార్థులకు వడ్డిస్తున్న వంటకాలు, భోజనం తయారు చేసేందుకు వాడుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాకమీషన్ చైర్మన్ ఆకునూరి మురళీ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాకమీషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్స్, రెసిడెన్సియల్స్, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మద్యాహ్న భోజనాలు పరిశీలించడం జరుగుతుందన్నారు. అదే విధంగా రెగ్యూలర్ స్కూల్స్, గురుకులాలలో విద్యార్థుల పరిస్థితి, టాయిలెట్స్ పరిస్థితి, వారికి కల్పించిన వసతులు చూస్తున్నామన్నారు. మరో 10 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా విజిట్ చేస్తామని తెలిపారు. ఈ విజిట్ లో భాగంగా ప్రభుత్వానికి ఏం చెప్పాలి, ఎక్కడ ఏ సంస్కరణలు అవసరం ఉంటాయో ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ముఖ్యంగా రెడీ మిక్స్ లు కొనవద్దని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాల నాణ్యతపై సిబ్బందికి శిక్షణ ఇస్తామని, ఒక ప్రోటోకాల్, ఒక స్టాండర్డ్ ఆపర్టిన్ ప్రాసిజర్ ను ప్రభుత్వం తయారు చేస్తుందన్నారు. మూడు నాలుగు రోజుల్లో ఆ ప్రొసీజర్ వస్తుందని, దానిలో వంట ఏ విధంగా వండడం, వండిన ఆహార పదార్థాలను పదిలపరచడంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. పుడ్ పాయిజనింగ్ అయినప్పుడు ఎందుకు అవుతది..ఏ విధంగా అవుతదని తెలియాల్సి ఉంది. దీనిపై ఏవిధంగా తీసుకోవాలని శిక్షణ ఇస్తాం. హస్టల్స్, రెసిడెన్సియల్స్, రెగ్యూలర్ పాఠశాలలను పరిశీలిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలించిన అనంతరం పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. విద్యార్థినీలు ఎక్కడా తక్కువ కాదు..అన్నిరంగాల్లో ముందుండాలి. విద్యార్థినీలు, బాలుర కంటే తక్కువ అనుకోవద్దని మంచిగా చదివి అన్ని రంగాల్లో ముందుండాలని ఆకునూరి మురళీ సూచించారు. ముందు తాము ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఓ డాక్టర్, ఓ ఇంజనీరు, మంచి శాస్త్రవేత్తలు తయారవుతారన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను వారి తల్లిదండ్రులు 14 సంవత్సరాలు వచ్చిందంటే చాలు పెళ్లిల్లు చేస్తుంటారని, మీరు జీవితంలో స్థిరపడిన తరువాత పెళ్లిల్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ డీడీ అఖిలేష్ రెడ్డి, హాస్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# కేఏ పాల్ పిటిషన్ ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించాలని కేఏ పాల్ పిటిషన్
- ఈ అంశం ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ పరిధిలో ఉందన్న హైకోర్టు
- ప్రస్తుతం తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టీకరణ




హైదరాబాద్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : పార్టీలు మారిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ నిర్ణయాల్లో జోక్యం చేసుకోకుండా, తీర్మానాల్లో ఓటు వేయకుండా ఆదేశించాలని తన పిటిషన్ లో పాల్ కోరారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు పార్టీలు మారితే ప్రజల్లో నమ్మకం పోతుందని చెప్పారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకపోతే పార్టీలు మారడం సహజమైపోతుందని తెలిపారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు... పిటిషన్ ను కొట్టివేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ పరిధిలో ఉందని హైకోర్టు తెలిపింది. ఈ అంశంపై తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఇటీవల వెలువరించిన తీర్పులో పేర్కొన్నామని చెప్పింది. స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే సదరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించలేమని స్పష్టం చేసింది.

# సిపివో జరిగిన అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి

### - సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



సంగారెడ్డి,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సిపివో ఆపీస్ లో జరిగిన అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపటం జరిగింది.మొన్న సీపీవో కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై పలు రకాల సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. జిల్లాలో ముఖ్యమైన కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదం షార్ట్సర్క్యూట్ వల్ల కార్యాలయంలోని కంప్యూ టర్, ఏసీ, కొన్ని ఫైళ్లు దగ్ధమయ్యాయని దీనిపై పలు రకాలుగా అనుమానం తో పత్రికలలో వార్తలు వస్తున్నాయని వాటిని నివృత్తి చేయాల్సిన భాద్యత ప్రభుత్వం పై ఉన్నదని అన్నారు.కార్యాలయ సిబ్బంది ట్యూబైట్ స్విచ్ వేసిన కాసేప టికి షార్ట్సర్క్యూట్ జరిగిందని అంటున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం కోరుతున్నదని అన్నారు.

---

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు భేల్ భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు



రామచంద్రాపురం,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : హుజురాబాద్ లో నవంబర్ 29 నుండి డిసెంబర్ 1 వరకు జరిగే ఎస్జిఎఫ్ఐ 68వ రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో రామచంద్రాపురం లోని భేల్ టౌన్షిప్ లో గల భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొననున్నారు. అక్టోబర్ నెలలో కంది లోని డిఏవి స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీలలో భవన్స్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 జిల్లా స్థాయి నుండి ఎంపికైన భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు బాలురు తడుక సాయి నిశాంత్, ప్రసాద్, బాలికలు జ్యోతిర్మయి, నిఖిత, దేవ హర్షిని, అక్షయ గురువారం హుజూరాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పయనమయ్యారు. విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ ఉమా శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ శ్రీవాణి, హెడ్ మిస్సెస్ భాను నిర్మల మరియు పిఈటీ బృందం శుభాకాంక్షలు తెలిపారు.

---

# జాతీయస్థాయి ఈతల పోటీలకు భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు



రామచంద్రాపురం,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : ఎస్జిఎఫ్ఐ 68వ జాతీయస్థాయి ఈతల పోటీలకు రామచంద్రాపురం లోని భేల్ లో గల భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పయనమయ్యారు. అక్టోబర్ లో జరిగిన రాష్ట్రస్థాయి ఈతల పోటీలలో భవన్స్ విద్యార్థులు ఆలియా ఫాతిమా, రితిక సాహితీ, శుభాంగ్ లు ప్రతిభ కనబరిచారు. గుజరాత్ లోని రాజ్ కోట్ లో నవంబర్ 26 నుండి డిసెంబర్ 1 వరకు జరిగే జాతీయస్థాయి ఈతల పోటీలలో పాల్గొనేందుకు విద్యార్థులు పయనమయ్యారు. ఈ సందర్భంగా భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ ఉమా శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ శ్రీవాణి, హెడ్ మిస్సెస్ భాను నిర్మల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

---

# సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### - సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు




సదాశివపేట,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం సంగారెడ్డి ని ఐటీ హబ్ గా అభివృద్ధి చేయాలని సిపిఎం కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. నేడు సిపిఎం రాష్ట్ర 4 వ మహాసభల విజయవంతం కోసం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో విరాళాలు సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలు జనవరి 25 నుండి మంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయడానికి అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సంగారెడ్డి అన్ని విధాలుగా విస్తరిస్తున్న ఐ టి హబ్ లేక పోవటం తో వెనుక పడిందన్నారు. సంగారెడ్డి అభివృద్ధికి నిధులు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు నర్సిములు, కృష్ణ, అశోక్, మేష్ గౌడ్, మహేష్, దత్తు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# మురికి కాలువ నిర్మాణ పనులను పరిశీలించిన వైస్ చైర్మన్



నారాయణఖేడ్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో జరుగుతున్న మురికి కాలువ నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ సహకారంతో మురికి కాలువలు నిర్మాణం పనులు చేపట్టుతున్నామన్నారు. మురికి కాలువ నిర్మాణ పనులు నాణ్యతగా చేయాలని సూచించారు.

---

# జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్తాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్




సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : నిన్న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్తాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా ప్రజా పరిషత్ హాలో లో నిర్వహించడం జరిగింది, ఈ పోటీలో ప్రభుత్వ పాఠశాల తెలుగు విభాగం లో ఉన్నత పాఠశాల ఎద్దుమైలారం కంది మండలం, ఇంగ్లీష్ మీడియం లో ప్రాథమికొన్నత పాఠశాల అనంతసాగర్ కొండపూర్ మండలం, గురుకుల పాఠశాలల విభాగంలో తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల కంది,ప్రైవేట్ పాఠశాల ఇంగ్లష్ మీడియంలో సేంట్ ఆంథోనీ హైస్కూల్ విద్యానగర్, సంగారెడ్డి మండలం విద్యార్థులు జిల్లా ప్రథమ స్థానంలో వచ్చారు. వీరు డిసెంబర్ 14,15, మరియు 16న ఆదిలాబాద్ లో జరిగే రాష్ట్రస్తాయి చెకుముకి పోటీలో పాల్గొనవలసి ఉంటుంది, ఇట్టి కార్యక్రమం లో ఉదయం 10గంటలకు జిల్లా కార్యనిర్వాహన ముఖ్య అధికారి,జానకిరెడ్డి గారు పరీక్ష పేపర్స్ ఆవిష్కరణ చేశారు, అనంతరం ప్రథమ స్థానం లో నిలిచినా విద్యార్థులకు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి,మాట్లాడుతూ జానవిజ్ఞాన వేదిక విద్యార్థులకు, సైన్స్, శాస్త్రా విజ్ఞానం పెంపొందించడంలో, మరియు ప్రజల్లో మూఢనమ్మకల నిర్మూలనలో, పర్యావరణ పరిరక్షణ, శితల పనియాలు మాని, సహజ సిద్ధమైన పనియాలు సేవించాలని జె. వి. వి కృషి అభినందనీయం, అని చెప్పారు, సంగారెడ్డి, మరియు కంది మండల విద్యాధికారుల జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు బాలయ్య గైని .ప్రధానకార్యశదర్శి సాయితేజ, రాష్ట్ర కార్యదర్శి జ్. ప్రతాప్ కుమార్ చేతుల మిదుగా మెమంటోస్, ప్రశంషా ప్రత్రాలు ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో జెవివి కోశాధికారి ప్రశాంత్ కుమార్, గౌరవ అధ్యక్షులు జూనపాల్ మహేష్ చారి , చంద్రశేఖర్, మొగులయ్య, కె. రాములు, నరేందర్ చెకుముకి కన్వీనర్ శశిదర్ తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలు



కరస్పాండెంట్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని పూలే విగ్రహానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేశారని, అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్. వెంకటేశ్వర్లు, విఠల్, శ్రవణ్ రెడ్డి, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

---

# ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆద్వర్యంలో..పూలే వర్ధంతి వేడుకలు



సంగారెడ్డి,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పంబల్లా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక విప్లవ యోధుడని, అణగారిన వర్గాల ఆశ జ్యోతి , బడుగు బలహీన వర్గాల బాంధవుడుగా ప్రజలలో నిలిచి పోయాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత సీనియర్ నాయకులు అనంతయ్య, కనకయ్య, బైండ్ల అశోక్ కుమార్, ఎంపీటీసీ నందకిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సంచుల, ఉదయ్, పురుషోత్తం, ప్రమోద్, లక్ష్మణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

---

# సెప్టెంబర్ 29న దీక్ష దివస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

పఠాన్ చేరు,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : ఈ రోజు అనగా 29-11-2024 తేదీన శు క్రవారం ఉదయం 9:00 గంటలకు గౌరవ బి ఆర్ స్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కె టీ ర్ మరియు మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు గారి పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా బి ఆర్ స్ పార్టీ కార్యాలయం (కంది )దగ్గర దీక్ష దివస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పృథ్వీరాజ్ ఒక ప్రకటన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పఠాన్ చెరువు నియోజకవర్గంలోని రాష్ట్రస్థాయి నాయకులు, కార్పొరేటర్లు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గం స్థాయి ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉప సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, మార్కెట్ చైర్మన్లు డైరెక్టర్లు, జేఏసీ నాయకులు, సొసైటీ చైర్మన్ లు, సొసైటీ డైరెక్టర్లు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, మాజీ గుడి చైర్మన్ లు, గుడి డైరెక్టర్లు, భిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సభ్యులు, భిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అనుబంధ సంఘాల అధ్యక్షులు సభ్యులు, భిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ సభ్యులు, భిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు సభ్యులు, మీడియా మిత్రులు, మరియు కార్యకర్తలు అందరూ హాజరు కాగలరు..

## తృటిలో తప్పిన ప్రమాదం - మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం





సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని ఐ.బి సమీపంలో గురువారం ఉదయం ఫ్లెక్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం వలన రహదారిలో ప్రయాణిస్తున్న వాహనదారిపై ఫ్లెక్సీ విరిగిపడిన క్రమంలో వాహనదారుడు గాయాల పాలు కాగా స్థానికులు గాయపడిన వాహనదారిని ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో భాగంగా పూర్తిగా ట్రాఫిక్ స్తంభించడం వలన డ్యూటీలో ఉన్నటువంటి ట్రాఫిక్ కానిస్టేబుల్ ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఈ విధంగా ఫ్లెక్సీలను మలుపుల వద్దఏర్పాటు చేయడం వలన రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు రోడ్డు కనపడకపోవడం వలన చాలాసార్లు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంగారెడ్డి పట్టణ మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీలను ఎక్కడ అంటే అక్కడ ఫ్లెక్సీలను పెట్టకుండా మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీ నిర్వాకులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుచున్నారు.

---

## ఓటరు జాబితాపై డిఎల్పీఓ విచారణ



హత్నూర,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన బిట్ల మహేష్ ఓటర్ల నమోదు జాబితాలను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 18న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డిఎల్పిఓ అనితా దౌల్తాబాద్ గ్రామ పంచాయతీలో ప్రజ ప్రతినిధులు, గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి విచారణ జరిపారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లను ఒక వార్డు నుండి ఇతర వార్డులకు మార్పులు చేశారంటూ వారి సమస్యలను తెలియజేశారు. కుటుంబ సభ్యులను ఒకే వార్డులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విచారణ అనంతరం డిఎల్పిఓ మాట్లాడుతూ ఓటర్ల నమోదు జాబితాలో మార్పులు చెర్పులపై పరిశీలించి పూర్తి నివేదికను పై అధికారులకు పంపించడం జరుగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

---

## పారిశుద్ధం పనులు పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్





నర్సాపూర్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : నర్సాపూర్ పురపాలక సంఘం చైర్మన్ గురు స్వామి శ్రీ దుర్గప్ప గారి అశోక్ గౌడ్. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం పరిసరాలలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో స్థానిక డి ఆర్ ఈ ఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓ మధులత, మండల పరిషత్ అధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్ చల్ల మురళి, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, వార్డు అధికారి రాములు పాల్గొనడం జరిగింది. అనంతరం పట్టణంలోని వివిధ వార్డులలో రోడ్ల మరమ్మత్తు పనులను పరిశీలించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మేనేజర్ శ్రీ మధుసూదన్ గారు, వర్క్ ఇన్స్పెక్టర్ భూపాల్ తదితరులు పాల్గొనడం జరిగింది.

---

## హ్యాపీ హెల్త్ కేర్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ను సీజ్ చేయండి

**- డీఎంఅండ్ హెచ్ఓకు ఫిర్యాదు చేసిన యజమాని**



కరస్పాండెంట్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్ లో గల హ్యాపీ హెల్త్ కేర్ ను అనుమతులు లేవని ఇప్పటికే సీజ్ చేశారని, కానీ తన అనుమతి లేకుండా ఆసుపత్రిని తెరిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపై స్పందించి ఆసుపత్రిని ఓపెన్ చేయకుండా సీజ్ చేయాలని యజమాని ఎం. విష్ణు డీఎంఎచ్ఓ కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి బైపాస్ రోడ్ లో రిలయన్స్ స్మార్ట్ ఎదురుగా హ్యాపీ హెల్త్ కేర్ పేరుతో డెంటల్ క్లినిక్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందనీ, ఇందులో డ్యూటీ డాక్టర్గా గంటల వారిగా అల్లూరి శిల్ప అనే డెంటల్ డాక్టర్ ను నియమించుకోవడం జరిగిందన్నారు. తాను ఇతర పనులలో బీజీగా ఉండడంతో క్లినిక్ మొత్తం సొంతం చేసుకుని, ఇంటి యజమానితో తనకు ఉన్న లీజ్ అగ్రిమెంట్ ను ఉల్లంగించి మరో అగ్రిమెంట్ చేసుకునే ప్రయత్నం చేశారనీ, పైగా క్లినిక్ లో తన అనుమతి లేకుండా పలు కార్యక్రమాలు నిర్వహించారని ఫిర్యాదులు పేర్కొన్నారు. రోగుల వద్ద ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేయడం, సరైన ట్రీట్మెంట్ చేయకపోవడంతో నిలదీయగా గొడవ పెట్టుకున్నారే తప్ప క్లినిక్ ను ఖాళీ చేసి వెళ్లలేదనీ, పైగా శివరాజ్ అనే వ్యక్తిని డ్యూటీ డాక్టర్గా పెట్టుకుని వైద్యం చేస్తున్నారన్నారు. పేషంట్లకు సరైన ట్రీట్మెంట్ అందకపోవడం, చేసిన వైద్యం వికటించడంతో పదుల సంఖ్యలో రోగులకు ఆరోగ్యం విషమించింది అని అన్నారు. తన అనుమతి లేకుండా తన క్లినిక్ ను సొంతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న డాక్టర్లు శిల్ప, శివరాజ్ పైనా డెంటల్ బోర్డుకు కూడా ఫిర్యాదు చేయబోతున్నానని తెలిపారు. ఆసుపత్రి ప్రారంభంలో మల్టీ స్పెషాలిటీ క్లినిక్ గా అనుమతి తీసుకోవడం జరిగిందనీ, రెన్యూవల్ సమయంలో వాటిని తొలగించి ఒక్క డెంటల్ క్లినిక్ గానే అనుమతి తీసుకున్నాననీ, అయినా అనుమతి లేకుండా ఫిజియోథెరపీ క్లినిక్ కూడా నిర్వహిస్తున్నారనీ అన్నారు. పై విషయాలను పరిగణలోకి తీసుకుని హ్యాపీ హెల్త్ కేర్ మల్టి స్పెషాలిటీ క్లినిక్ ను సీజ్ చేయాలని డీఎంఅండ్ హెచ్ఓ ను కోరారు.

## రేగోడ్ కేజీబీవీలో ముక్కిన కూరగాయలు





సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : రేగోడ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ పాఠశాలలో పిల్లల ఆహార మేను ఏర్పాటులో నాణ్యతలేని ముక్కిన కూరగాయలను వాడుతున్నారు. వివరాల్లోకి వెళితే రేగోడు మండల ఎంఈఓ గురునాథ్ గురువారం స్థానిక వైద్య సిబ్బంది కాంప్లెక్స్ హెచ్ఎం తో కలిసి కేజీబీవీ పాఠశాలను విజిట్ చేశారు. పాఠశాల ఫుడ్ ఐటమ్ స్టోర్ రూమ్ ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ గురునాథ్ మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా నాణ్యతలేని, కుళ్లిపోయిన కూరగాయలు స్టోర్ రూమ్ లో ఉన్నట్టు తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో వారానికి ఒకసారి మెదక్ నుండి కూరగాయలు వస్తాయని వాటిని స్టోర్ చేయడం ఇబ్బందిగా ఉందని ఎస్ఓ స్వయంప్రభ తెలిపారని అన్నారు. వారానికి రెండుసార్లు కూరగాయలు వచ్చే విధంగా చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. తక్షణమే నాణ్యతలేని కూరగాయలను స్టోర్ రూమ్ నుండి తీసేయాలని వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కేజీబీవీ సిబ్బందికి తెలిపామన్నారు. ఈ మధ్యకాలంలో ప్రభుత్వ విద్య సంస్థల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ విషయంలో. మండలంలోని అన్ని ప్రభుత్వ విద్య సంస్థలో సైతం ఉన్నతాధికారులు సందర్శించి పరిస్థితిని సమీక్షించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆకస్మికంగా ప్రభుత్వ అధికారులు సైతం విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

---

## అద్దె భవనంలో నిర్వహించైనా నూతన పిహెచ్ సి లో ప్రజలకు వైద్యం అందించాలి



రాయికోడ్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని సింగితం గ్రామానికి మంజూరైనా నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను తొందరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనొద్దీన్, మైబల్లి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా ను కోరారు. గ్రామాలలో ఉన్న ఆర్ఎంపి వైద్యులు పరిమితికి మించి వైద్యం చేయొద్దని డిఎంఏచ్ఓ ఆదేశాలతో చాలమంది ఆర్ఎంపి డాక్టర్లు వైద్యం చేయక వారి క్లినిక్ లను మూసివేసుకోవడం జరిగింది. కావున సింగితం గ్రామంలో ప్రజలకు ఏ చిన్న రోగం వచ్చిన అత్యవసరం లో ఏ డాక్టర్ వైద్యం చేయలేని పరిస్థితి ఉంది కావున గ్రామానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తాత్కాలికంగా అద్దె భవనంలో నిర్వహించైన ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి సకాలంలో వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

---

## గంజాయి సాగు నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష

**- రూ.25వేల జరిమాన విధించిన న్యాయస్థానం**
**- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్**



కరస్పాండెంట్,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : తన పంట చేలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తూ పట్టుపడ్డ నిందితుడికి జిల్లా న్యాయస్థానం ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధించారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం కంగ్టీ మండలంలోని సిద్దంగర్గ గ్రామంలో బసప్ప మైల్కూర్ అనే నిందితుడు తన యొక్క వ్యవసాయ భూమి సర్వే నెంబర్ 74/ఈ, విస్తీర్ణం 1.12 గుంటలలో పత్తి పంట వేసి, అంతర్ పంటగా గంజాయి సాగు చేస్తున్నాడని గ్రామ వీఆర్ఓ గుర్తించి, కంగ్టీ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన అప్పటి కంగ్టీ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ జి.నరేష్ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారన్నారు. విచారణ అనంతరం నిందితుడిని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టగా కేసు పూర్వపరాలను విన్న అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కె.జయంతి నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ. 25 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన అధికారులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్, అప్పటి యస్.హెచ్.ఒ./ ఇన్వెస్టిగేషన్ అధికారి జి.నరేష్ ఎస్ఐ, ప్రస్తుత యస్.హెచ్.ఒ. యస్.విజయ్ కుమార్, ఎస్ఐ, కోర్ట్ డ్యూటీ హెడ్.కానిస్టేబుల్స్ రవి కుమార్, శంకర్, కోర్ట్ లైజనింగ్ అధికారి కె. సత్యనారాయణ ఎస్ఐ లను ఎస్పీ అభినందించారు. జిల్లాలో ఎవరైన గంజాయి సాగు లేదా సరఫరా చేసిన పై విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు అట్టి వ్యవసాయ భూమిని జప్తు చేసి, ప్రభుత్వానికి అప్పగించడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలో మాధకద్రవ్యాల గురించిన సమాచారం తెలినట్లైతే వెంటనే జిల్లా ఎస్-న్యాబ్ నెంబర్ 8712656777 కు సమాచారం అందించాలని సూచించారు.

---

## గ్రామీణ మహిళలకు మాగ్గం వర్క్ లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 29 ( మెతుకు సీమ న్యూస్) : డిసెంబర్-6-2024 నుండి ప్రారంభం స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సంగారెడ్డి లో నెలరోజుల పాటు మగ్గం వర్క్ లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు యస్ బి ఆర్ యస్ టి ఐ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేసారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలు (18 సం,, నిండి ఉండి 45 సం,, లోపు) వారు ఈ శిక్షణా కు హర్హులు. ఉచిత భోజనం , ఉచిత వసతితో పాటు ఉచితంగా శిక్షణ మగ్గం వర్క్ కిట్టు ఇవ్వబడును అప్లికేషన్ కి చివరి తేది: డిసెంబర్ 4కావలసిన ధ్రువపత్రాలు: 1.రేషన్ కార్డ్ జిరాక్స్ 2.ఆధార్ కార్డ్ జిరాక్స్ 3.10%ష్ట్ర% క్లాస్ మెమో జిరాక్స్ . 4. నాలుగు పాస్పోర్ట్ పాస్ పోర్ట్ సైజ్ పోటో లు. 5. బ్యాంక్ అకౌంట్ వివరాలు. పూర్తి వివరాలకు 9704446956,9490129839 నెంబర్ కి సంప్రదించగలరు.(ఈ సందేశాన్ని మీ వాట్సాప్ గ్రూప్స్ లో షేర్ చేయగలరు...మీరు షేర్ చేయడం వల్ల కనీసం ఒక్కరికైనా ఉపయోగపడవచ్చు)

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com